సాక్షి
బాపట్ల
సోమవారం ♦ 9 ♦ సెప్టెంబర్ ♦ 2024



కారెంపూడి చేరుకున్న యాత్ర

కారెంపూడి: ఇండియన్ ఆర్మీ లడక్ నుంచి అండమాన్ నికోబార్ దీవుల వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర ఆదివారం కారెంపూడి చేరుకుంది. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్వాగతం పలికారు.



ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మ దేవస్థానం అభివృద్ధికి చిలువూరుకు చెందిన బొడ్డపాటి శంకర్, అరుణ దంపతులు రూ.1,00,116 అందజేశారు.



బాడీ బిల్డింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జోనల్ లెవెల్ బాడీ బిల్డింగ్, స్టేట్ లెవెల్ కెటిల్ బెల్ పోటీలు జరిగాయి.

లంక గ్రామాలు గజగజ

ఆగని వర్షాలు.. ఎగువ నుంచి ముంచుకొస్తున్న వరద ముప్పు

- వేమూరు, రేపల్లెతోపాటు జిల్లావ్యాప్తంగా వర్షం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 4.20 లక్షల క్యూసెక్కులు విడుదల
- అరవింద వారధి వద్ద గండి నుంచి కొల్లూరు కరకట్ట వైపునకు ప్రవహిస్తున్న నీరు
- దోనేపూడి లోలెవల్ వంతెన పైకి చేరిన నీరు
- పలు లంక గ్రామాలకు రాకపోకలు బంద్
- ఆందోళనలో ప్రజలు
- ఎనిమిది లక్షల క్యూసెక్కులకు వరద పెరిగే అవకాశం
- పునరావాస కేంద్రాలకు రావాలంటూ అధికారుల హెచ్చరికలు
- ఇప్పటికీ బురదలోనే గ్రామాలు
- బిక్కుబిక్కుమంటున్న ముంపు బాధితులు



అరవింద వారధి నుంచి లంక గ్రామాల వైపు ప్రవహిస్తున్న వరద నీరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇటీవల వచ్చిన వరద ముంపు నుంచి తేరుకోకముందే లంక ప్రజల గుండెల్లో రాయి పడింది. కృష్ణాకు రెండోసారి వరద ముంపు తప్పేలా లేకపోవడంతో బెంబేలెత్తుతున్నారు. ఏ నిమిషంలో కృష్ణమ్మ ముంచెత్తుతుందోనని ఆందోళన చెందుతున్నారు. 11.90 లక్షల క్యూసెక్కుల నుంచి శనివారం నాటికి 3.20 లక్షలకు తగ్గిన వరద ఉన్నట్లుండి ఆదివారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. శ్రీశైలం డ్యాం నుంచి 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నాగార్జునసాగర్, పులిచింతలల నుంచి అంతే స్థాయిలో వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో ఆదివారం మధ్యాహ్ననికి ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.20 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు.

కొల్లూరు కరకట్ట వైపునకు వరద ప్రవాహం

వారం కిందట వచ్చిన వరదతో కొల్లూరు మండలంలో అరవింద వారధి వద్ద గట్టు తెగింది. ఇప్పుడు ఆ ప్రాంతం నుంచి నీరు కొల్లూరు కరకట్ట వైపునకు ప్రవహిస్తోంది. దోనెపూడి కరకట్ట కింద లోలెవల్ వంతెన పైకి నీరు చేరింది. పాతర్లంక, తోకలవారిపాలెం,తిప్పలకట్ట,తురకపాలెం, కిష్కింధపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు మరింతగా పెరిగితే పెసర్లంక రోడ్డును ముంచెత్తడంతోపాటు భట్టిప్రోలు మండలం వెల్లటూరు రోడ్డు పైకి చేరే అవకాశముంది. దీంతో చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించనున్నాయి.

వరద పెరిగే అవకాశం

వరద నీరు ఎనిమిది లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే లంక గ్రామాలన్నీ మళ్లీ నీటమునిగే అవకాశముంది. దీంతో ప్రజలంతా పునరావాస కేంద్రాలకు తరలిరావాలని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

లంక ప్రజల గుండెల్లో భయం

పది రోజుల్లో రెండోసారి వరదముప్పు పొంచి ఉండడంతో లంక గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆగస్టు 30 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. కృష్ణాకు వరద పోటెత్తడంతో 11.90 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదలచేశారు. దీంతో కొల్లూరు మండలంలో కృష్ణా గట్టుకు గండిపడి లంక గ్రామాల్ని వరద ముంచెత్తింది. వారం రోజులుగా గ్రామాలు నీటిలోనే ఉన్నాయి. వరద ఉధృతికి వేలాది ఎకరాల్లో పసుపు,అరటి,తమలపాకు, కంద, జామ తదితర వాణిజ్యపంటలు దెబ్బతిన్నాయి. ఇళ్లు నేలకూలాయి. విలువైన టీవీ, ఫ్రిజ్, ఏసీ, గ్యాస్ పొయ్యిలతో పాటు మొత్తం సామగ్రి పనికిరాకుండా పోయింది. నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. పట్టెడన్నం, గుక్కెడు నీళ్లు దొరక్క అల్లాడి పోయారు. వరద వచ్చి పదిరోజులు కావస్తున్నా ముంపు బాధితులు ఇళ్లలోని బురదను పూర్తిగా కడుక్కోలేకపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో లంకగ్రామాల ప్రజలు సాయంకోసం ఎదురు చూపులు చూస్తున్నారు.



కొల్లూరు మండలం దోనేపూడి కరకట్ట వద్ద లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

జిల్లావ్యాప్తంగా వానలు

శనివారం నుంచి తిరిగి వర్షాలు వేమూరు, రేపల్లె నియోజకవర్గాలతోపాటు జిల్లావ్యాప్తంగా కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నాటికి జిల్లాలోని సంతమాగులూరులో అత్యధికంగా 3 సె.మీ. కురిసింది. వేమూరులో 2.7 సె.మీ. చుండూరు, బాపట్లలలో 1.8, కర్లపాలెం, కారంచేడు, నగరంలలో1.5 సెంటీమీటర్ల వర్షంకురిసింది. అమృతలూరు, కొల్లూరు, పిట్టలవానిపాలెం, మార్టూరు ప్రాంతాల్లో ఒక సెంటీమీటర్ మేర వర్షపాతం నమోదైంది. సాయంత్రానికి పెరిగింది. దీంతో జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

లంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

వేమూరు: రెండోసారి వరద నేపథ్యంలో లంక గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి సూచించారు. ఆదివారం ఆయన లంక గ్రామాల్లో పర్యటించారు. ఆ ప్రాంతంలో వాగులు, చప్టా, రహదారులను ఆయన పరిశీలించారు.యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన ప్రజల్ని కోరారు. పశువులను ఎతైన ప్రాంతాల్లో కట్టాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖార్ జైన్, రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

వరద హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: లంక గ్రామాలకు వరద ముప్పు ప్రమాదం పొంచి ఉందని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులతో ఆయన ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణా నది వరద ప్రవాహం 5.5 లక్షల క్యూసెక్కులకు చేరడంతో రివర్ కన్జర్వేటర్స్ నుంచి రెండో హెచ్చరిక జారీ అయిందని కలెక్టర్ ప్రకటించారు. 3.5 లక్షల క్యూసెక్కులకు పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజర్లంక మూడు లంక గ్రామాలు నీట మునుగుతాయని తెలిపారు. ప్రస్తుతం రెండో హెచ్చరికతో 13 ఆవాస ప్రాంతాలు నీట మునుగుతాయని చెప్పారు. ఎనిమిది లక్షల దాటితే 24 ఆవాస ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఆ ప్రాంతాలలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విస్తృత ప్రచారం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వినాయక చవితి నిమజ్జనం చేయడానికి నది నీళ్లలోకి ఎవరు వెళ్లరాదని స్పష్టం చేశారు. గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, క్యాన్సర్, గుండె జబ్బులు ఉన్న వారందరినీ యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయాల ఉద్యోగులు, క్షేత్రస్థాయి ఉద్యోగులంతా ఏ గ్రామాలకు కేటాయించారో అక్కడే ఉండాలని చెప్పారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన విధులు నిర్వహించాలని, ఆ ప్రాంతాలకు తక్షణమే చేరుకోవాలని సూచించారు. అవసరమైన జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, వాటి కోసం డీజిల్ సమకూర్చుకోవాలని ఆదేశించారు. వరద హెచ్చరిక నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రకార్ జైన్ తెలిపారు. నిత్యావసర సరుకుల్నిసిద్ధం చేసుకోవాలని డీఎస్‌ఓను ఆయన ఆదేశించారు. పునరావాస కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బియ్యం ప్యాకెట్లతో గణనాథుడు



చీరాల అర్బన్: పట్టణంలో వినాయక చవితి పండుగను వాడవాడలా నిర్వహిస్తున్నారు. పలు వార్డుల్లో పందిళ్లు ఏర్పాటు చేసి వివిధ ఆకృతుల్లో గణనాథులను ప్రతిష్ఠించారు. అమరావారి వీధిలోని గణపతి మందిరంలో స్వామికి బంగారు కిరీటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బియ్యం ప్యాకెట్లతో తయారుచేసిన గణనాథుడు ఆకట్టుకున్నాడు.

వైద్య పరీక్షలు కరువు



కొల్లూరు : వరద ముంపు గ్రామాల్లో వృద్ధులకు వైద్య పరీక్షలు కరువయ్యాయి. గ్రామాల్లో వైద్య శిబిరాలు తూతూమంత్రంగా నడుస్తున్నాయి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ శిబిరాలకు వెళుతున్న వృద్ధులు నిరాశతో తిరిగివెళుతున్నారు. సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించకుండానే మందులిచ్చి పంపేస్తున్నారు.

గృహోపకరణాలు వరద పాలు



కొల్లూరు : వరద ప్రవాహం ఇళ్ల పైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో గృహోపకరణాలు మొత్తం కొట్టుకుపోయాయి. ఇళ్లలో రోజువారీ వినియోగించుకునే వంట పాత్రలతోపాటు టీవీలు, మంచాలు, పరుపులు సైతం వరద నీటిలో తేలియాడుతూ నష్టాలకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మండలంలోని తడికలపూడిలో వరద నీటిలో కొట్టుకొచ్చిన టీవీలు, మంచాలు, పరుపులు కనిపించాయి.

కొనసాగిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన



గుంటూరు మెడికల్: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఈ నెల 4న విడుదల చేసిన జీఓ నెంబర్ 115ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగింది. గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేపట్టిన ఈ కార్యక్రమం మూడో రోజుకు చేరుకుంది. నర్సింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ బైఠాయించారు. శనివారం వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడికి పూజలు చేశాక వినతి పత్రం అందించి వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గబోమని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.వి జయ్‌కుమార్, హైమావతి, కుసుమ కుమారి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

తెనాలి రూరల్: వినాయక నిమజ్జన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జి.సతీష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి వద్ద కొమ్మమూరు కాల్వలో ఏటా నిమజ్జనం చేస్తుంటారు. ప్రస్తుతం కాల్వలో నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో ఎస్పీ పరిశీలించారు. అక్కడ నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను తెలుసుకున్నారు. తెనాలి రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, చేబ్రోలు పోలీసులు ఆయన వెంట ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం



సరుకులు వాహనానికి జెండా ఊపుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వరద బాధితులకు ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఒక రోజు వేతనం విరాళంతో పాటు ఐదు ట్రక్కుల్లో దుప్పట్లు, వివిధ రకాల పచ్చళ్ల, నిత్యావసర సరుకులు, మినరల్ వాటర్ బాటిల్స్‌ను విరాళంగా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్న వాహనాలను కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏడు లక్షల క్యూసెక్కులు వరద నీరు వస్తే అది భయంకరమైన విపత్తుగా భావించేవారన్నారు. ఈసారి ఊహకు కూడా అందని విధంగా 11.30 లక్షల క్యూసెక్కులు పైగా రావడంతో లంక గ్రామాలకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఇంతటి విపత్తును ప్రణాళికాబద్ధంగా ముందస్తు జాగ్రత్తలతో ఎదుర్కొన్నట్లు చెప్పారు. అధికారులు కూడా ఆదేశాలు పాటించి సహకరించారని పేర్కొన్నారు. రెండు పశువుల మినహా జీవాల మరణాలు జరగలేదని వెల్లడించారు. అయితే, పంటలకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. బాపట్ల, రేపల్లె ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారిని పర్యవేక్షణ అధికారిగా నియమించామని కలెక్టర్ పేర్కొన్నారు. లంక గ్రామాల్లోని 4,400 పశువుల కోసం 400 టన్నుల దాణాను సంగం డెయిరీ నుంచి తెప్పించి పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎండు గడ్డి మొత్తం కుళ్లిపోయిందని, పచ్చి గడ్డి రావాలంటే మరో నెల రోజులు సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్క పశువుకి 25 కేజీల చొప్పున శక్తివంతమైన దాణా రెండు రోజుల కిందటే ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు మాట్లాడుతూ కలెక్టర్ తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతోనే విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి ఓంకార్, మహిళా రెవెన్యూ ఉద్యోగుల సంఘం చైర్మన్ పి. రజిని, ప్రధాన కార్యదర్శి షేక్ హజ్రా బేగం పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్టు

24 కిలోల వెండి, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని నగల దుకాణంలో ఈ నెల 4న జరిగిన దొంగతనం కేసులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను పొన్నూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 24 కిలోల వెండి వస్తువులు, 6 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు కేసు వివరాలను వెల్లడించారు. కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. పక్కా వ్యూహంతో అర్ధరాత్రి పొన్నూరులోని నగల దుకాణంలో చోరీ చేశారని పేర్కొన్నారు. స్థానికులు వారిని పట్టుకునేందుకు వెంబడించగా నలుగురు కారులో పరారయ్యారని తెలిపారు. మిగిలిన సుమన్ కమతి, విక్రందాస్ చరణ్, ఉత్తమ్ సింగ్ పొన్నూరులో పట్టుబడ్డారని చెప్పారు. కారులో పరారవుతున్న మితాలాల్ మాలి, పరస్‌రామ్‌లను చిత్తూరు జిల్లాలోని టోల్ ప్లాజా వద్ద చంద్రగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆషు సింగ్, అజు పరారీలో ఉన్నారని వెల్లడించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

నాడు కళకళ నేడు వెలవెల





పచ్చని పంట పొలాలతో కళకళలాడే కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాలు కళా విహీనంగా మారాయి. వరదలు మరుభూములుగా మార్చేశాయి. దీనికి ఈ ఫొటోలే సాక్ష్యం. భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువున నాడు కళకళలాడిన పసుపు నేడు కుళ్లి, ఎండిపోయింది. పంటలను చూసి రైతులు కన్నీటి పర్యంతరమవుతున్నారు.

– భట్టిప్రోలు


ఎమ్మెల్యే పర్యటనలో అపశ్రుతి

- రామాపురంలో బాణసంచా కాల్చడంతో ముగ్గురు బాలికలకు గాయాలు
- కావాలని తమ వారిపై విసిరారని ఆరోపిస్తున్న మరో వర్గం

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం మత్స్యకార గ్రామంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ పర్యటనలో ఆదివారం అపశ్రుతి చోటు చేసుకుంది. ఒక వర్గానికి చెందిన ముగ్గురు బాలికలకు బాణసంచా రవ్వలు పడి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రామాపురంలో రెండు వర్గాలకు చెందిన మత్స్యకారులు విడివిడిగా వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ఆదివారం ఒక వర్గం వారి మందిరం వద్ద పూజకు ఎమ్మెల్యే వచ్చారు. ఆ సమయంలో ఆయనకు స్వాగతం పలుకుతూ భారీగా బాణసంచా కాల్చారు. అదే సమయంలో రెండో వర్గానికి చెందిన వారు వినాయకుడిని నిమజ్జనం పూర్తి చేసి, తిరిగి ఇళ్లకు చేరుకుంటూ ఎదురుపడ్డారు. ఈ సమయంలో అవ్వాయి చువ్వలు వారిపై పడ్డాయి. అది గమనించిన పెద్దలు కొంత మంది పరుగులు తీశారు. అక్కడే ఉన్న ముగ్గురు ఆడ పిల్లలకు వాటి రవ్వలు పడి కాలాయి. దీంతో వారిని చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. దీంతో రెండు వర్గాలకు ఒకటిన్నర సంవత్సరం నుంచి ఉన్న పాత గొడవలు తిరిగి బయట పడ్డాయి. కావాలని తమ వారిపై బాణసంచాలు విసిరారని ఒక వర్గం వారు ఆరోపిస్తున్నారు. లేదు.. పొరపాటున బాణా సంచా చువ్వలు పడ్డాయని మరో వర్గం వారు వాదిస్తున్నారు. ఇది కాస్తా గ్రామంలో పాత ఘర్షణలపై ప్రభావం చూపుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



బాధితులను 108లో ఎక్కిస్తున్న గ్రామస్తులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

ఈ- క్రాప్ బుకింగ్‌లో జాప్యంపై ఆవేదన

పెదకాకాని: ఈ-క్రాప్ బుకింగ్‌లో అధికార యంత్రాంగం ప్రదర్శించిన అలసత్వంపై కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ ప్రాంతంలో వానలు, వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి వచ్చిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కష్టాలు వివరించారు. దీంతో ఈ- క్రాప్ బుకింగ్ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వెంకట కృష్ణాపురం, హాఫ్‌పేట, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, శేకూరు, వీరనాయకునిపాలెం, సుందరయ్య కాలనీ, ముట్లూరు, పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, అనుమర్లపూడి ప్రాంతాలలో వానలు, వరద వల్ల జరిగిన నష్టాలను మంత్రి పరిశీలించారు. అనంతరం పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ నీట మునగడంతో ఇండస్ టవర్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుమారు 330 మందికి దుస్తుల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను ఐదు రోజులుగా పర్యటిస్తున్నానని చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని గుర్తుచేశారు.

క్లుప్తంగా

క్రిస్టియన్ మైనారిటీ సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాన్‌వెస్లీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఆయా వర్గాలతో పార్టీ బలోపేతానికి పాటుపడతానని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించిన ఆయన గత ప్రభుత్వంలో ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించారన్నారు. మళ్లీ గుర్తించి పార్టీలోని క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటానని జాన్‌వెస్లీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఆమంచి

చీరాల: బాపట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్టీ తరఫున చీరాలలో పోటీ చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనకు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఏఎన్‌యూలో పాముకాటుతో విద్యార్థి మృతి



పెదకాకాని: పాముకాటుతో బుద్ధిజం విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన కొండన్న పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏ బుద్ధిజం (మహాయాన బుద్ధి స్టడీస్ కోర్సు) చదువుకునేందుకు ఈ సంవత్సరం చేరాడు. సహచర విద్యార్థులతో అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. పుట్ట గొడుగుల కోసం శనివారం రాత్రి క్యాంపస్ ఆవరణలోని పుట్టల వద్ద సహచర విద్యార్థులతో కలిసి వెళ్లాడు. అక్కడే ఉన్న రక్తపింజర పాము కొండన్నను కాటేసింది. సహచరులు ఆ పామును గుర్తించడం, చంపడంతో కొండన్నను వైద్యం నిమిత్తం తరలించడానికి ఆలస్యం అయింది. తర్వాత చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే కొండన్న మరణించినట్లు నిర్ధారించారు. వర్సిటీ అధికారుల దృష్టికి విద్యార్థులు ఈ విషయం తీసుకెళ్లడంతో వారు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. అనంతరం సమాచారాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు.

వాణిజ్య పంటలు వరదార్పణం



రంగు మారిన అరటి తోట



పాడై పోయిన దొండ పందిరి

వాణిజ్య పంటలకు ప్రసిద్ధి చెందిన కొల్లూరు మండలంలోని లంకలను వరదలు ముంచెత్తాయి. ఈపూరు కరకట్ట కింద పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతుల రెక్కల కష్టం ఏటి పాలైంది. కళ్లలో వత్తులు వేసి సాగు చేసిన పసుపు, తమలపాకు, అరటి, దొండ తోటలు వర్షార్పణం అయ్యాయి. పసుపు చేలల్లో వర్షం నీరు నిలవడంతో ఆకు, దుంప కుళ్లిపోతోంది. తమలపాకు తోటలు తలలు వాల్చాయి. పిలకదశలో ఉన్న అరటి తోటలు నీటి నిల్వతో రంగు మారిపోతున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన దొండ పందిరులు నేలమట్టం అయ్యాయి.

టెన్నీకాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక

చెరుకుపల్లి: రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ (సబ్ జూనియర్) టోర్నమెంటుకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికను ఆదివారం సెక్రెటరీ కాట్రగడ్డ అరవిందకుమార్ పర్యవేక్షణలో కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాను విడగొట్టిన నేపథ్యంలో బాపట్ల జిల్లాకు అలేఖ్య, పల్నాడు జిల్లాకు జి.ఝాన్సీ, గుంటూరు జిల్లాకు బి.రమేష్‌బాబును అసోసియేషన్ సెక్రటరీలుగా నియమించినట్లు తెలిపారు. సబ్ జూనియర్ బాలికలు విభాగంలో పిట్టు భాగ్యలక్ష్మి, చీరాల గాయత్రి (ప్రభుత్వ ఉన్నత పాఠశాల కావూరు), పోపూరి సాగరిక, తానిపర్తి నవ్య (కస్తూరిబా బాలికల విద్యాలయం) ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. బాలుర జట్టుకు కావూరి శివప్రసాద్, పిట్టు జగదీష్ రెడ్డి, అక్కల లోకేష్‌మారుతీ బ్రహ్మారెడ్డి, తమనం లితేష్ కుమార్ కావూరు ప్రభుత్వ పాఠశాల నుంచి ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా త్వరలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అరవింద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వై. సాంబశివరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు దొప్పలపూడి ప్రమీల, నందూరి రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన జట్లతో జిల్లా సెక్రెటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు

గణేష్ నిమజ్జనంలో అప్రమత్తత అవసరం

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

కర్లపాలెం: గణేష్ నిమజ్జనంలో అప్రమత్తత అవసరమని బాపట్ల అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. ఆయన ఆదివారం రూరల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ రవీంద్రతో కలసి కర్లపాలెం, పేరలి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సందర్శించారు. విగ్రహ కమిటీలకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం చేసే సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. చవితి వేడుకలు పూర్తయ్యేంత వరకు కమిటీ సభ్యులే రాత్రిపూట కాపలా ఉండాలని ఆదేశించారు. నిమజ్జన సమయంలో మద్యం తాగకూడదని సూచించారు. కర్లపాలెంలోని తుంగభద్ర కాలువకు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున రాత్రి ఏడు గంటల్లోపు పోలీసుల సూచనల మేరకు నిమజ్జనాలు పూర్తి చేయాలని చెప్పారు.



ఎంవీరాజుపాలెంలో జరిగిన పూజల్లో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

కమలేశ్చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

నరసరావుపేట రూరల్: కమలేశ్చంద్ర పే కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.మల్రెడ్డి కోరారు. మండలంలోని ఇస్సప్పాలెం ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో ఆదివారం నరసరావుపేట డివిజన్ గ్రామీణ సేవక్స్ యూనియన్ 12వ ద్వైవార్షిక మహాసభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మల్రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ ఆదాయాన్ని తీసుకువచ్చే గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్) వల్లే పోస్టల్ శాఖ నడుస్తుందని తెలిపారు. పోస్టల్ శాఖకు ప్రోత్సాహాన్ని ఇస్తున్న జీడీఎస్‌పై పోస్టల్ శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. డాక్ సేవక్స్‌ను తక్కువ జీతాలతో పనిచేయిస్తుండంతో పాటు వారికి బెన్‌ఫిట్స్ రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీంతో పాటు ఈ మధ్యకాలంలో లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. పెన్షన్ విధానం, ఎనిమిది గంటల పని విధానం, మెడికల్ వసతులతో పాటు కమిటీ చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సంఘం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జి.రామచంద్రయ్య, కార్యదర్శిగా పీవీ నారాయణ, కోశాధికారిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మంగళగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 14, 15వ తేదీలలో జరగబోయే పోటీలకు గుంటూరు పవర్ లిఫ్టింగ్ జట్లను ఎంపిక చేశారు. 11వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ విభాగాల్లో మెన్, ఉమెన్ జట్లు పాల్గొననున్నాయి. క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలలో ఈ జట్లు పాల్గొననున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 30 మంది మహిళలు, 40 మంది పురుషులతో కూడిన ఈ జట్లు రాణించాలని ఆకాంక్షించారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిని ప్రతినిధులు కొమ్మాకుల విజయ భాస్కర రావు, షేక్ సంధాని అభినందించారు.



ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

కలువ పూల కోసం కాల్వలోకి దిగి వ్యక్తి మృతి

స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

నగరం: కలువ పూలు కోసం కాల్వలో దిగిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆదివారం మండలంలోని చిరకాలవారిపాలెం మురుగు కాల్వలో(ఉప్పు కాల్వ) జరిగింది. ఎస్ఐ భార్గవ్ సమాచారం మేరకు.. రేపల్లె పట్టణం 27వ వార్డుకు చెందిన కొలుసు సుబ్బారావు (48) పూల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వినాయక చవితి సందర్భంగా మూడు రోజుల నుంచి ఉప్పు కాల్వలో పూలు కోసుకుని వెళ్లి అమ్ముకుంటున్నాడు. ఆదివారం ఉదయం ఉప్పు కాల్వలో దిగాడు. పూల కోసం మరింత లోతుకు వెళ్లి మునిగి పోవడంతో మృతి చెందాడు. కాల్వ బాగా లోతుగా ఉందని చెప్పినా సుబ్బారావు వినకుండా కలువ పూలకోసం కాల్వలో దిగి ప్రాణాలు కోల్పోయాడని పలువురు పేర్కొంటున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఉప్పు కాల్వలో గాలించి సుబ్బారావు మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్బారావు మరణవార్తతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుమారులు ఇద్దరికీ వివాహాలయ్యాయి. మృతుడి పెద్ద కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.



సుబ్బారావు మృతదేహం

లంక గ్రామాల్లో ప్రతి కుటుంబాన్నీ ఆదుకోవాలి

వేమూరు: వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో ప్రతి కుటుంబాన్నీ ప్రభుత్వం ఆదుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు కోరారు. కొల్లూరు మండలంలో వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో యూటీఎఫ్ బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 10 ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నీట మునిగాయని, పుస్తకాలు, మెటీరియల్ తడిసి పోయిందని తెలిపారు. ఏడు స్కూళ్లు బాగా దెబ్బతిన్నాయని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులకు పూట గడవటం కష్టంగా ఉందని, మూడు నెలల వరకు లంక గ్రామాల్లో ఎటువంటి పనులు కూడా ఉండవని తెలిపారు. పిల్లలకు పుస్తకాలు కొనే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పుస్తకాలతో పాటు యూనిఫాం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు జి. వినయకుమార్, ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు. జిల్లా కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వినోద్‌బాబు, శాంతారావు, కె.వి. శ్రీనివాసరరావు, పరిశుద్ధరావు, మండల అధ్యక్షుడు రాజేష్, సీఐటీయూ నాయకులు బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.



పాఠశాలలో తడిసిపోయిన పుస్తకాలను పరిశీలిస్తున్నయూటీఎఫ్ బృందం నాయకులు

డ్వాక్రా రుణాలను రీషెడ్యూల్ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి

భట్టిప్రోలు: డ్వాక్రా సంఘాల రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ ప్రభుత్వమే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి, బాపట్ల కార్యదర్శి సీహెచ్. గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సీపీఎం బృందం రెండు రోజులుగా రైతులు, కౌలు రైతులు, డ్వాక్రా మహిళలను కలసి వారి సమస్యలను తెలుసుకుంటోంది. వరదలకు పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని పలువురు వాపోయారు. వరదల వల్ల పాడైన ఇళ్లకు రూ. 10 వేలు నష్టపరిహారం చెల్లించాలని, డ్వాక్రా రుణాలు తీసుకున్న వారు తిరిగి కట్టేందుకు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పర్యటనలో నేతలు ఎం.సత్యనారాయణ, పి.మనోజ్, వి.వెంకట్రామయ్య, బీఎల్‌కే ప్రసాద్, పి.నాగమల్లేశ్వరరావు, బి. సుబ్బారావు, బి.అగస్టీన్ పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న రమాదేవి

వినాయక చవితి వేడుకల్లో యువకుడు మృతి

విద్యుత్ దీపాలు అలంకరణ చేస్తుండగా పోట్లూరు ఎస్సీ కాలనీలో దుర్ఘటన



శావల్యాపురం: వినాయకచవితి వేడుకల్లో విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పోట్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామంలో బీసీ కాలనీలో శ్రీనీలంపాటి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ఎస్సీ కాలనీకి చెందిన పోపూరి దేవసహాయం (20) విద్యుత్ దీపాలు అలంకరణ చేస్తున్నాడు. ఈ సమయంలో 11 కేవీ విద్యుత్ సామర్థ్యం కల్గిన విద్యుత్ లైను ప్రమాదవశాత్తు తగలటంతో తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఎస్సీ కాలనీలో తీవ్ర విషాదం

పోపూరి సుబ్బారావు వృత్తిరీత్యా విద్యుత్ పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తుంటాడు. ఇందులో భాగంగా తండ్రికి సహాయంగా, కుటుంబానికి చేదోడు వాదోడుగా దేవసహాయం ఉంటున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడు వినాయకచవితి పండుగ రోజు మృతిచెందడంపై తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇంక తమకు దిక్కెవరు అంటూ వారు పెట్టే రోదనలు చూపరులను సైతం కంటతడి పెట్టించాయి. పోట్లూరు ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లారీ డ్రైవర్‌ను బలిగొన్న అతి వేగం

- ముందు వెళ్తున్న ట్రాక్టర్, మరో వాహనాన్ని ఢీకొన్న లారీ
- ట్రాక్టర్ డ్రైవర్‌కు, మృతుడి కుమారుడికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: హైవేపై ఓ లారీ డ్రైవరు అతివేగంతో వెళ్లడంతో ప్రాణాలు కోల్పోయాడు. ముందు వెళుతున్న ట్రాక్టర్, మరో లారీని అతడు నడిపే వాహనం ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు, ప్రమాదానికి కారణమైన లారీలో ఉన్న మృతుడి కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతురెడ్డి గ్రామానికి చెందిన మరమోసి బాబు (40), ఆయన కుమారుడు యశ్వంత్‌లు శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి అనంతపురానికి సరుకుల లోడుతో లారీలో బయల్దేరారు. ఈ లారీ శనివారం తెల్లవారుజామున ప్రత్తిపాడు మండలం బోయపాలెం జాతీయ రహదారిపైకి వచ్చింది. అప్పుడే తాడేపల్లిగూడెం నుంచి చిలకలూరిపేటకు డెలివరీ ఇచ్చేందుకు తీసుకెళుతున్న కొత్త ట్రాక్టర్‌ను బలంగా ఢీకొంది. అధిక వేగం కారణంగా అదుపుకాక మరో లారీని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న యజమాని బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. క్యాబిన్‌లో కూర్చుని ఉన్న యశ్వంత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. రెండు పల్టీలు కొట్టుకుంటూ ట్రాక్టర్ పక్కకు పడిపోవడంతో దాని డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతని వివరాలు తెలియాల్సి ఉంది. మరో లారీకి పెద్దగా నష్టం జరగకపోవడంతో అందులోని వారు వెళ్లిపోయారు. బాబు మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు క్రేన్‌ల సాయంతో దాదాపు గంటన్నరకుపైగా శ్రమించాల్సి వచ్చింది. యశ్వంత్, ట్రాక్టర్ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాబు భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన లారీ ముందు భాగం



బాబు మృతదేహం

వేర్వేరు చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్ట్

మేడికొండూరు: జల్సాలకు అలవాటు పడి ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్సై డేవిడ్ రాజు కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గోగువారి గూడేనికి చెందిన నర్సింగ్ గంగాధర్, నర్సింగ్ మహేష్‌లు, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన చింతా సాయికుమార్, బలుకూరి భీమలింగేశ్వరరావు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాలూరు గ్రామానికి చెందిన జెట్టి కృష్ణ వేర్వేరు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారిని మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 17.8 గ్రాముల బంగారం, 674 గ్రాముల వెండి వస్తువులు, కారును స్వాధీనం చేసుకున్నారు. పేరేచర్ల డొంకలో సంజీవరావు హోటల్ వద్ద సంచరిస్తుండగా నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మేడికొండూరు, పల్నాడు జిల్లా నకిరేకల్, సంతమాగులూరు పోలీస్ స్టేషన్లలో వీరిపై పలు దొంగతనాల ఇప్పటికే కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. పీసీలు జి. సిద్ధయ్య, కె.బాజీ సాహెబ్, కోటయ్య, శ్రీకాంత్, హోంగార్డులు ఎస్‌కే జానీ, వెంకటేశ్వర్లు ఈ కేసుల్లో ప్రతిభ చాటినందున ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అభినందించారని పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై డేవిడ్ రాజు

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో సమాజ గతిని మార్చగల ఏకైక శక్తి ఉపాధ్యాయులకే ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిరోడ్డులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం పాన్ ఇండియా ఐకానిక్ టీచర్స్ అవార్డ్స్–2024' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఒక పెన్ను, పుస్తకం, ఒక ఉపాధ్యాయుడికి ప్రపంచాన్ని మార్చగలిగే సత్తా ఉందని చెప్పిన ఆయన మలాలా యూసఫ్‌జాయ్ కలలను నిజం చేయాలని ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. అంకితభావంతో విద్యార్థులకు చదువుతోపాటు జీవిత గమనాన్ని నేర్పాలని సూచించారు. ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రామనాథం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం స్థాపించిన ఫెడరేషన్ ద్వారా కరోనా సమయంలో వందలాది మంది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందించి వారిలో ధైర్యాన్ని నింపామన్నారు. ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కన్నా మాస్టారు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఇండో అమెరికన్ డాక్టర్ చాగంటి సుబ్బారావు, శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఫెడరేషన్ ప్రతినిధులు

కాలువలో పడి లస్కర్ మృతి

నరసరావుపేట రూరల్: ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఎన్ఎస్‌పీ కాలువ లస్కర్ మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. లింగంగుంట్ల ఎన్ఎస్‌పీ కాలనీలో నివాసముంటున్న మల్లా లక్ష్మయ్య(50) చిలకలూరిపేట మేజర్ కాలువపై శాంతినగర్ వద్ద నుంచి గోవిందపురం మేజర్ వరకు లస్కర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదల ఉండటంతో శుక్రవారం డ్యూటీకి వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం లక్ష్మయ్య పనిచేసే ప్రాంతానికి వెళ్లి సిబ్బంది పరిశీలించారు. శాంతినగర్ సమీపంలోని డ్రాప్ వద్ద లక్ష్మయ్య ఉపయోగించే హ్యాండిల్, చెప్పులు కనిపించాయి. దీంతో కెనాల్‌లో సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం శాంతినగర్‌కు కిలోమీటర్ దూరంలో మృతదేహాన్ని రైతులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎన్ఎస్‌పీ సిబ్బంది అక్కడకు చేరుకొని లక్ష్మయ్యగా గుర్తించారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. నకరికల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

